సాక్షి తిరుపతి

మంగళవారం । 29 । జూలై । 2025



స్కిట్ కళాశాలలో అడ్మిషన్లు

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న స్కిట్ కళాశాలలో ఈ విద్యాసంవత్సరం అడ్మిషన్లకు అనుమతించారు. - 8లో



విద్యావ్యవస్థ నిర్వీర్యం

కూటమి సర్కారు విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసిందని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబుల్ రెడ్డి అన్నారు. - 8లో



వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఇల్లు కూల్చివేత

పెళ్లకూరు అరుందతీయవాడలో వైఎస్సార్ సీపీ కార్యకర్త ఇంటిని కూటమినేతల ప్రోద్బలంతో కూల్చివేశారు. - 8లో

న్యూస్‌రీల్

పోలీసు కుటుంబానికి రూ.కోటి బీమా



డీడీ అందజేస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుపతి క్రైమ్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఏఎస్ఐ కుటుంబానికి బీమా మొత్తం రూ.కోటి మొత్తానికి సంబంధించిన డీడీని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు సోమవారం బాధితులకు అందజేశారు. ఈ ఏడాది మార్చి 12వ తేదీన ఏఎస్ఐ గురుస్వామి వడమాలపేట వద్ద విధుల నిర్వహిస్తూ ఇంటి కెళ్లే క్రమంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అయితే స్టేట్ బ్యాంకులో శాలరీ అకౌంట్ కలిగి ఉండడంతో ప్రమాద బీమా రూ.కోటి మంజూరు అయ్యింది. ఆ మొత్తానికి సంబంధించిన డీడీని జిల్లా ఎస్పీ చేతుల మీదుగా మృతుడు భార్య చిట్టెమ్మకు అందజేశారు.

3న బాల్‌బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపిక

శ్రీకాళహస్తి: పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాల మైదానంలో ఆగస్టు 3వ తేదీ ఉదయం 8 గంటలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ సబ్ జూనియర్స్, సీనియర్స్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు చిత్తూరు జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి బాలాజీ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్ విభాగంలో క్రీడాకారులు జనవరి 2, 2010 తరువాత జన్మించి ఉండాలన్నారు. సెలక్షన్‌కు వచ్చే క్రీడాకారులు తమ వెంట ఆధార్‌కార్డు, బ్లడ్ గ్రూప్ తప్పని సరిగా తీసుకురావాలన్నారు. డ్రెస్‌కోడ్ పాటించాలని తెలిపారు. ఎంపికలో చిత్తూరు జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటస్వామి, చైర్మన్ జగన్నాథంనాయుడు, అసోసియేషన్ సభ్యులు పాల్గొంటారని చెప్పారు. మరిన్ని వివరాలకు 7013754776, 9848295471 నంబర్లలో సంప్రదించాలన్నారు.

భూసేకరణ వేగవంతం చేయండి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: చెన్నై- బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌కు సంబంధించి భూసేకరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన జేసీ శుభం బన్సల్‌తో కలసి భూసేకరణపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసేకరణ పనుల్లో పురోగతి చూపాలని ఆదేశించారు. ప్రధానంగా రోడ్ల పనులను పూర్తి చేసి, అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే వాటికి పరిష్కారం చూపుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఏపీ ఐఐసీ జోనల్ మేనేజర్ విజయ్‌భరత్‌రెడ్డి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బస్సులేనా?

అరకొర ఆర్టీసీ సర్వీసులు.. పలు గ్రామాలకు మొహం చాటేసిన పల్లెవెలుగు సర్వీసులు.. తప్పని ప్రయాణాలు.. విధిలేక బస్సుల కోసం నిరీక్షణ.. ప్రయాణికులకు తిప్పలు.. ఈ స్థితిలో మహిళలకు ఉచిత బస్సులంటూ సర్కారు ప్రకటనలు..అది కూడా పల్లెవెలుగులకే పరిమితమంటూ ఆదేశాలు.. జిల్లాకు చేరని కొత్త బస్సు సర్వీసులు.. వెరసి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సాఫీగానే.. కూటమి ఆర్భాటపు హామీ అమలు అయ్యేనా? అన్న సందేహం కలుగుతోంది. ఉచిత బస్సు పథకం ఉత్త బుస్సే అని మహిళలు ఆరోపిస్తున్నారు.



జిల్లా ఆర్టీసీ సమాచారం

డిపోలు	సర్వీసులు
తిరుపతి	102
తిరుమల	91
మంగళం	89
శ్రీకాళహస్తి	97
పుత్తూరు	79
సత్యవేడు	50
గూడూరు	54
సూళ్లూరుపేట	44
వెంకటగిరి	58
వాకాడు	43
మొత్తం డిపోలు	11
మొత్తం బస్సులు	707
విద్యుత్ బస్సులు	100

ఉచితం అన్నింట్లో కాదు.. కొన్ని బస్సుల్లోనే..

ఉచితం అన్ని బస్సుల్లో కాదని...కొన్ని బస్సుల్లో మాత్రమే ఉంటుందని ఆర్టీసీ అధికారులకు ఉన్నతాధికారులు సమాచారం ఇచ్చేశారు. ఇదే విషయాన్ని రాష్ట్ర మంత్రులు వెల్లడించారు. ఎన్నికల సమయంలో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అంటూ హామీ ఇచ్చారు. అయితే పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌లు, మెట్రో సర్వీసులు, టౌన్ సర్వీసులకు మాత్రమే ఉచితంగా మహిళలు ప్రయాణం చేయడానికి అవకాశం కల్పిస్తామని చెబుతున్నారు. అయితే జిల్లాలో తిరుపతి-శ్రీకాళహస్తి మార్గంలో నడుస్తున్న 14 మెట్రోల్ సర్వీసులు మాత్రమే ఉన్నాయి. మరోవైపు జిల్లాలో టౌన్ సర్వీసులు ఏ డిపో పరిధిలోను లేవు. ఈ క్రమంలో పూర్తిగా ఉచిత బస్సు స్కీమ్ పల్లెవెలుగు సర్వీసులపైనే ఆధారపడుతుందని అంతా భావిస్తున్నారు.

15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

- పల్లెవెలుగు, అల్ట్రా పల్లె వెలుగుకే ఉచితం పరిమితం
- జిల్లాలో తీవ్రమైన బస్సుల కొరత



పల్లెవెలుగు బస్సు (మహిళలు ఉచిత ప్రయాణానికి ఎంపిక చేసిన బస్సు)

తిరుపతి అర్బన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది తర్వాత..మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేయాలనే అంశం గుర్తుకొచ్చింది. ఆగస్టు 15వ తేదీ నుంచి అమలు చేస్తామంటూ మంత్రులు పదేపదే ప్రకటనలు చేస్తున్నారు. అయితే జిల్లాలో ఇప్పటికే ఆర్టీసీ బస్సుల కొరత తీవ్రంగా ఉంది. దీంతో 350 గ్రామాలకు పైగానే ఆర్టీసీ బస్సులు వెళ్లడం లేదు. గ్రామీణ ప్రాంతాలకే కాకుండా కాణిపాకం, శ్రీకాళహస్తి, తిరుచానూరు తదితర ఆలయాలకు అవసరం మేరకు ఆర్టీసీ సర్వీసులు లేవు. దీంతో 50 వరకు అద్దె బస్సులను తీసుకుని పలు మార్గాల్లో నడుపుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో మాత్రమే..

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మాత్రమే ఆర్టీసీ కేటాయింపు చేసిన బస్సుల్లో ప్రయాణం చేయాల్సి ఉంటుంది. జిల్లా దాటితే టిక్కెట్ తీసుకోవాల్సి ఉంది. మరోవైపు తిరుమలకు అవకాశం కల్పించలేదు. రోజుకొసారి మాత్రమే ఓ మహిళ ప్రయాణం చేయడానికి వీలుంటుందని ఆర్టీసీ అధికాకారులు చెబుతున్నారు. ఈ నెల 29వ తేదీన ఎండీ నిర్వహిస్తున్న డీఎంల సదస్సులో పూర్తి వివరాలను వెల్లడిస్తారని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.

ఆదాయం రాని మార్గాల్లో పల్లె వెలుగు కట్

ఆదాయం రాని మార్గాల్లో పల్లెవెలుగు బస్సులను నిలుపుదల చేయాలని భావిస్తున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులకు తిప్పలు తప్పవని అంతా భావిస్తున్నారు. ఇప్పటికే 350 మార్గాల్లో పల్లెవెలుగు బస్సులు నడవడం లేదు. ఉన్న పల్లెవెలుగు సర్వీసులను ఉచిత బస్సు స్కీమ్‌కు వినియోగిస్తే జిల్లాలోని ఏ గ్రామీణ ప్రాంతానికి పల్లెవెలుగు బస్సులు నడిచే పరిస్థితులు ఉండవని అంతా భావిస్తున్నారు.

కొత్త బస్సుల ఊసేదీ?

జిల్లాలో పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు సర్వీసులు 300 మాత్రమే ఉన్నాయి. జిల్లాలో 12.50 లక్షల మంది మహిళలు ఉన్నారు. ఉచితం అంటే 12.50 లక్షల మందికి మహిళలకు 300 బస్సుల్లో సర్దుబాటు చేయడం వీలుకాదని ఆర్టీసీ అధికారులే బాహాటంగా చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాలకు వెళుతున్న పల్లెవెలుగు సర్వీసులను ఉచిత బస్సుల కోసం ప్రధాన ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తే.. ఇక గ్రామీణ ప్రాంతాలకు ఒక్కటంటే ఒక్క ఆర్టీసీ సర్వీసులు ఉండదని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటివరకు జిల్లాలో కొత్త బస్సుల ఊసేలేదు. పాడైన పది సర్వీసులను మాత్రమే కొత్త బస్సులుగా మార్పు చేసుకున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఒక్కో డిపోకు 50 కొత్త బస్సులను కొనుగోలు చేస్తామని పచ్చనేతలు చెప్పిన సంగతి తెలిసిందే. అయితే ఇప్పటివరకు ఆ ఊసేలేదు. మంగళం డిపో కేంద్రం 150 విద్యుత్ బస్సులను ఏర్పాటు చేస్తామంటూ కూటమి సర్కారు ఏడాదిగా చెబుతూనే ఉంది. అయితే ఆ దిశగా అడుగులు వేయడం లేదని ఆర్టీసీ వర్గాలే చెబుతున్నాయి. తిరుపతి జిల్లాలో 11 డిపోలున్నాయి. రాష్ట్రంలోనే డిపోలు ఎక్కువగా ఉన్న జిల్లానే కాకుండా రాబడిలోనూ ముందు వరుసలో ఉన్న జిల్లాగా తిరుపతికి పేరుంది. అయితే కొత్త బస్సులను ఏర్పాటు చేయకుండా ఉన్న పల్లెవెలుగు బస్సులను ఉచిత బస్సు పథకానికి వాడేస్తే అంతా గందరగోళం తప్పదంటూ పలువురు చర్చించుకుంటున్నారు.

నేటి ఎండీ సమావేశంలో స్పష్టమైన సమాచారం



“మహిళలకు ఉచిత బస్సు స్కీమ్‌పై మంగళవారం తిరుపతిలో జరగనున్న డీఎంల సమావేశంలో రాష్ట్ర ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు స్పష్టమైన సమాచారాన్ని తెలియజేస్తారు. జోన్-4 పరిధిలోని 54 డిపోలకు చెందిన రాయలసీమ డీఎంలు ఈ సమావేశాన్ని హాజరుకానున్నారు. ఆ మేరకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశాం. ప్రధానంగా డీఎంలకు ఉచిత బస్సు స్కీమ్ నిర్వహణపై అవగాహన కల్పించనున్నారు. సమావేశం అనంతరం పూర్తి వివరాలను మీడియాకు వెల్లడిస్తాం.

– జగదీష్, జిల్లా ప్రజా రవాణా అధికారి

ఎస్వీయూలో ఉద్యోగుల ముష్టియుద్ధం

- తీవ్రగాయాలతో రుయాస్పత్రిలో చికిత్స
- ఆర్థిక లావాదేవీతోనే ఒకరిపై ఒకరు దాడి



రుయాలో చికిత్స పొందుతున్న శ్రీనివాసరావు

తిరుపతి సిటీ: ఎస్వీయూలో ఉద్యోగుల గొడవ రణరంగాన్ని తలపించింది. వర్సిటీలోని ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులు సోమవారం పరిపాలనా భవనం ఎదుట ముష్టి యుద్ధాన్ని తలపించేలా ఒకరిపై ఒకరు దాడులకు దిగారు. తీవ్ర గాయాలపాలైన ఉద్యోగులు రక్త స్రావంతో రుయాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వివరాలలోకి వెళితే.. ఎస్వీయూ ఇంజినీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ఇంజినీర్లుగా విధులు నిర్వహిస్తున్న సుబ్రమణ్యం, శ్రీనివాసరావు మధ్య కొంత కాలంగా ఆర్థిక లావాదేవీల విషయంలో గొడవలు జరుగుతుండేవని తోటి ఉద్యోగులు చెబుతున్నారు. ఇందులో భాగంగా సుబ్రమణ్యం అనే ఉద్యోగికి తోటి ఉద్యోగి శ్రీనివాసరావు రూ.2 లక్షలు వరకు అప్పు ఉన్నాడని, గత రెండేళ్లుగా చెల్లించకుండా దాటవేత ధోరణితో వ్యవహరిస్తున్నాడని తెలిసింది. దీంతో పలుసార్లు సదరు ఉద్యోగి పోలీసులకు సైతం ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఆర్థిక లావాదేవీలతో పాటు ప్రమోషన్ విషయంలో తనకే రావాలి..అడ్డు తగలవద్దు..అంటూ ఇద్దరి మధ్య తరచూ వాగ్వాదం నెలకొనేదని తెలిసింది. దీంతో సోమవారం వర్సిటీ ఆవరణలో ఇద్దరూ తారస పడిన నేపథ్యంలో ఆర్థిక లావాదేవీల కారణంతో పాటు ప్రమోషన్‌కు అడ్డువస్తున్నారనే కోపంతో వారిద్దరి మధ్య మాటా మాటా పెరిగి, ఒకరిపై ఒకరు రాళ్లతో దాడి చేసుకున్నారు. తోటి ఉద్యోగులు అక్కడికి చేరుకుని ఇద్దరినీ విడదీసే ప్రయత్నం చేశారు.

తీవ్ర గాయాలతో రుయాలో చేరిక

ఎస్వీయూ పరిపాలనా భవనం ఎదుట ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న ఉద్యోగులు తీవ్ర గాయాలతో స్థానిక రుయాస్పత్రిలో చేరారు. శ్రీనివాసరావుకు తలపై గాయం కావడంతో వైద్యులు చికిత్స చేస్తున్నారు. అలాగే మరో ఉద్యోగి సుబ్రమణ్యంకు సైతం బలమైన లో గాయాలు తగలడంతో ప్రాథమిక చికిత్స అనంతరం డిశ్చార్జ్ చేశారు. దీంతో ఇరువురు ఎస్వీయూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

పేదల పక్షాన నిరంతరం పోరాటం



గిరిజన రైతులతో మాట్లాడుతున్న నేదురుమల్లి

- నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి

సైదాపురం: పేద రైతుల పక్షాన నిరంతరం వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తుందని ఆ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి తెలిపారు. సైదాపురం మండలంలో పేదలు సాగు చేసుకుంటున్న నిమ్మతోటలను అధికారులు నేల మట్టం చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన కమ్మవారిపల్లె గ్రామానికి వెళ్లారు. నిమ్మతోటలు ధ్వంసం చేసిన పొలాలను పరిశీలించారు. పేద రైతులతో మాట్లాడారు. తాను నిరంతరం అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. నిమ్మచెట్ల తొలగింపుపై అధికారులకు సోమవారం హైకోర్టు అక్షింతలు వేయడంపై ఆయన స్పందించారు. కోర్టు తీర్పు కూటమి ప్రభుత్వానికి, అధికారులకు కూడా ఓ కనువిప్పులాంటిదన్నారు. పేదలు సాగు చేసుకుంటున్న నిమ్మ చెట్లను నరికివేయడం ఏమిటని ప్రశ్నించారు. పేదలకు న్యాయం చేయాల్సిన ప్రజాప్రతినిధులు ఇలా వ్యవహరించడం ఏమిటన్నారు. ఇకనైనా అధికారులు నేతలు మాటలకు స్వస్తి పలికి పేదలకు సహాయం చేయాలని కోరారు. తాము ఎప్పుడు కోర్టులను గౌరవిస్తామన్నారు.

వైఎస్ జగన్ పర్యటన విజయవంతం చేద్దాం

వెంకటగిరి(సైదాపురం): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 31వ తేదీన నెల్లూరు పర్యటనను విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఆయన సాక్షితో మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం నెల్లూరు పర్యటన ఖరారైనట్లు తెలిపారు. తొలుత పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డితో నెల్లూరు సెంట్రల్ జైలులో ములాఖత్ అయి, పరామర్శించనున్నారని చెప్పారు. అనంతరం రోడ్డు మార్గంలో మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నివాసం వద్దకు చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించనున్నారని పేర్కొన్నారు. వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, శ్రేణులు, నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చి, జగనన్న పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఫలరాజం.. ఫ్యాక్టరీల భోజ్యం

మామిడి రైతుల ఏడాది శ్రమ అడవి కాచిన వెన్నెలగా మిగిలింది. కర్షకులు మామిడిని కంటికి రెప్పలా కాపాడి, దిగుబడి సాధించినా ఆశించిన ధరలు లేకపోగా.. జిల్లా ఉన్నతాధికారులు చెప్పిన మాటలు అమలుకు నోచుకోక.. ఫ్యాక్టరీ యాజమాన్యాల దోపిడీతో ఆశించిన ధరల్లేక విలవిల్లాడిపోయాడు. ఏ వస్తువుకైనా ధర నిర్ణయించే అధికారం ఉత్పత్తిదారుడికే ఉంది. అయితే ఆ పరిస్థితి రైతులకు లేదు. దీంతో పుడమిపుత్రులు దగా పడ్డారు. ఫలరాజైన మామిడికి ఫ్యాక్టరీ యాజమాన్యాలు తక్కువ ధర నిర్ణయించి, రైతులను దోపిడీ చేశాయి.




జిల్లా సమాచారం

మామిడి సాగు	50 వేల ఎకరాలు
తోతాపురి మామిడి రకం సాగు	36,250 ఎకరాలు
మామిడి రైతులు	28,654 మంది
తోతాపురి దిగుబడి	1,40,000 మెట్రిక్ టన్నులు
ఫ్యాక్టరీలు కొనుగోలు చేసిన తోతాపురి	90,000 మెట్రిక్ టన్నులు
రైతులు విక్రయించుకోలేకపోయిన తోతాపురి	50 వేల మెట్రిక్ టన్నులు
తోతాపురికి ఫ్యాక్టరీ ఇస్తామని రేటు టన్నుకు	రూ.8వేలు
తోతాపురికి ఫ్యాక్టరీ ఇచ్చిన రేటు టన్నుకు	రూ.4వేలు
ప్రభుత్వం టన్నుకు ఇస్తామని చెప్పింది	రూ.4వేలు
ఇప్పటి వరకు ప్రభుత్వం పైసా చెల్లించలేదు	

- చెప్పింది రూ.8 వేలు...ఇచ్చింది రూ.4 వేలే
- రైతుకు దక్కని గిట్టుబాటు ధర
- నెలరోజులు జిల్లాధికారుల చర్చలు వృథా
- వ్యవసాయశాఖా మంత్రి మాటలు ఉత్తుత్తివే

తిరుపతి అర్బన్: జిల్లాలో మామిడి సాగుతోపాటు పల్ప్ ఫ్యాక్టరీలు అధికంగానే ఉన్నాయి. అయితే రైతులకు మాత్రం ఆశించిన ధరలు దక్కడం లేదు. తోతాపురి మామిడికి గిట్టుబాటు ధరలు దక్కక రైతులు ఈ ఏడాది పడిన కష్టాలు అందరికీ తెలిసిందే. కొందరు రైతులు ఉచితంగా మామిడి కాయలను ఇంటింటికి పంచిపెట్టగా.. మరి కొందరు పశువులకు దాణాగా వేయగా.. ఇంకొందరు.. ఈ పంట వద్దురా బాబూ అంటూ ఏకంగా మామిడి చెట్లను సైతం నరికివేసిన సంఘటనలు ఈ ఏడాది అంతా చూశారు. నెల రోజుల పాటు జిల్లా అధికారులు జోరుగా మామిడి ఫ్యాక్టరీలకు చెందిన యాజమాన్యంతో చర్చలు జరిపారు. తప్పకుండా తోతాపురి మామిడి రకానికి టన్నుకు ఫ్యాక్టరీల నుంచి రూ.8వేలు, ప్రభుత్వం నుంచి రూ.4వేలు సబ్సిడీగా అందిస్తామని చెప్పారు. మొత్తంగా టన్ను తోతాపురి మామిడికి రూ.12 వేలు వచ్చేలా చేస్తామని చెప్పారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని రూ.12 వేలకు పైగానే ఇప్పిస్తామని ఎట్టి పరిస్థితుల్లోను 12 వేలకు ధర తగ్గదని స్పష్టం చేశారు. మరోవైపు చిత్తూరు పర్యటన సందర్భంగా రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి అచ్చెన్నాయుడు సైతం ఇదే మాట చెప్పారు. దీంతో రైతులు టన్నుకు రూ.12 వేలు ఇస్తే కనీసం పెట్టుబడులైనా వస్తాయని ఆశపడ్డారు. అయితే చెప్పిన మాటలు నీళ్ల మూటలుగానే మిగిలిపోయాయి. ఫ్యాక్టరీలకు చెందిన వారు రైతుల ఖాతాల్లోకి టన్నుకు రూ.4 వేలు మాత్రమే జమ చేశారు. దీంతో రైతులు ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని ప్రశ్నిస్తే ఇచ్చేది అంతే అంటూ సమాధానం చెప్పడంతో చేసేదీ లేక మౌనంగా ఉండాల్సిన పరిస్థితులు జిల్లాలో దాపురించాయి.

రూ.1.20 లక్షలు నష్టం



“తోతాపురి మామిడికి టన్నుకు రూ.8వేలు ఫ్యాక్టరీ వారు ఇస్తారని, టన్నుకు రూ.4వేలు ప్రభుత్వం ఇస్తుందని జిల్లా ఉన్నతాధికారులు, వ్యవసాయశాఖ అధికారులు హామీ ఇచ్చారు. దీంతో వారి మాటలపై నమ్మకంతో ఫ్యాక్టరీకి 30 టన్నులు తోతాపురి మామిడిని రెండు నెలల క్రితమే విక్రయించాను. అయితే ఫ్యాక్టరీ వారు నా బ్యాంక్ ఖాతాలో టన్నుకు రూ.4వేలు చొప్పున మాత్రమే జమ చేశారు. దీంతో నాకు రూ.1.20 లక్షలు తక్కువ వచ్చింది. ఈ విషయాన్ని ఉద్యానశాఖ అధికారులకు తెలియజేసినా వారు పట్టించుకోలేదు. ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని ప్రశ్నిస్తే ఇచ్చేది అంతే అంటూ సమాధానం ఇచ్చారు. మరోవైపు ప్రభుత్వం టన్నుకు రూ.4వేలు ఇస్తారని చెప్పారు. అది ఎప్పుడు ఇస్తారో తెలియడం లేదు.

–శ్రీనివాసులు రెడ్డి, మామిడి రైతు, బుచ్చినాయుడుకండ్రిగ

90 వేలు టన్నులు కొనుగోలు



“రైతుల నుంచి తోతాపురి మామిడిని 90వేలు టన్నులు ఫ్యాక్టరీల వారు కొనుగోలు చేశారు. దాదాపుగా మామిడి కొనుగోలు ప్రక్రియ జిల్లాలో ముగిసింది. జిల్లాలో తోతాపురి దిగుబడి 1.40 లక్షల టన్నులు వచ్చింది. ఫ్యాక్టరీల వారిని టన్నుకు రూ.8 వేలు ఇవ్వమని జిల్లాధికారులు చెప్పారు. ప్రభుత్వం టన్నుకు రూ.4 వేలు త్వరలో ఇస్తారు.

–దశరథరామిరెడ్డి, ఉద్యానశాఖ జిల్లా అధికారి

విలీనం వద్దు

- మా ఊరిలోనే స్కూలు కొనసాగించండి
- కలెక్టరేట్ వద్ద తంబూరు ఎస్సీకాలనీ వాసుల ధర్నా



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న తంబూరు హరిజనవాడ వాసులు

తిరుపతి అర్బన్: మాకు విలీనం వద్దు.. మా పాఠశాలను మా ఊరిలోనే ఉంచాలని నారాయణవనం మండలంలోని తుంబూరు ఎస్సీకాలనీ వాసులు ఆందోళన చేపట్టారు. సోమవారం కలెక్టరేట్ వద్ద తమ పాఠశాలను తమ గ్రామంలోనే ఉంచాలంటూ నినాదాలు చేశారు. ఏఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తుంబూరు హరిజనవాడ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి శివారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ నంబర్ 117ను తీసుకువచ్చి మూడు కిలోమీటర్ల లోపల ఉన్న పాఠశాలలను విలీన ప్రక్రియను ప్రారంభించిందని, ఇది అత్యంత దుర్మార్గమైన చర్య అన్నారు. వందలాది మంది విద్యార్థులకు విద్యను అందించే పాఠశాలలను విలీనం పేరుతో మూసి వేయడం చాలా దారుణమని పేర్కొన్నారు. తంబూరు హరిజనవాడ పాఠశాలలో 56 మంది విద్యార్థులు చదువుతుండగా కేవలం పదిమంది విద్యార్థులు ఉన్న మరో పాఠశాలలో విలీనం చేయడం ఏమిటని ప్రశ్నించారు. భవిష్యత్తులో మరిన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉంటుందని, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పాఠశాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఉదయ్ కుమార్, నాయకులు హరికృష్ణ, వినయ్, విష్ణు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పారదర్శకంగా ఉపాధి పనుల తనిఖీ


మాట్లాడుతున్న ఏపీడీ రెడ్డెప్ప

చంద్రగిరి: ఉపాధి హామీ పథకంలో జరిగిన పనుల తనిఖీలను పారదర్శకంగా నిర్వహించాలని ఎన్‌ఆర్‌ఈజీఎస్ పీడీ రెడ్డెప్ప సూచించారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి అధ్యక్షతన 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద చేపట్టిన పనుల సోషల్ ఆడిట్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 ఏప్రిల్1 నుంచి 2025 మార్చి 31వ తేదీ వరకు రూ.21.64 కోట్ల మేరకు ఉపాధి పనుల ద్వారా పనులు జరిగినట్లు తెలిపారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి సోషల్ ఆడిట్ నిర్వహించడం జరుగుతుందన్నారు. మంగళవారం నుంచి మండలవ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో జరిగిన పనులపై సిబ్బంది గ్రామస్తులు, ఉపాధి కూలీల సమక్షంలో తనిఖీలను చేపట్టడం జరుగుతుందన్నారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులను సిబ్బంది పారదర్శకంగా తనిఖీ చేపట్టాలని ఆయన కోరారు. ఉపాధి హామీ పథకం కింద పంచాయతీ రాజ్, ఇంజినీరింగ్, నీటి సరఫరా, హౌసింగ్, అటవీశాఖ, పశు సంవర్థక శాఖ, సర్వశిక్షా అభియాన్, సామాజిక పెన్షన్లపై తనిఖీలను చేపట్టాలన్నారు. ఉపాధి హామీ పథకం తనిఖీల్లో రాజీ పడకుండా చేయాలని, అవినీతికి పాల్పడిన వారిని గుర్తించి నివేదిక సమర్పించాలన్నారు. అనంతరం రామిరెడ్డిపల్లి, అగరాలలో జరిగిన అవకతవకలపై సర్పంచ్‌లు కొటాల చంద్రశేఖర్ రెడ్డి, అగరాల భాస్కర్ రెడ్డి అధికారులకు ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరత్నం, ఎస్ఆర్పీ వెంకయ్య, ఏపీఓ భార్గవి, పీఆర్ ఏఈ రాజాజీ తదితరులు పాల్గొన్నారు.

బావిలో మృతదేహం


బావి నుంచి వెలికితీసిన గజేంద్రుడి మృతదేహం

నాగలాపురం: మండలంలోని కృష్ణాపురంలో రోడ్డు పక్కన ఉన్న వ్యవసాయ బావిలో మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు. పోలీసులు కథనం మేరకు.. కృష్ణాపురం గ్రామానికి చెందిన తిప్పారెడ్డి, వెంకటేశ్వరరావు పొలంలో బావి ఉంది. ఆ బావిలో మృతదేహం ఉండగా గ్రామస్తులు గుర్తించి, పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. ఆ మృతదేహం సుమారు 40–45 ఏళ్లు ఉంటుంది. మృతుడు నీటిలో పడి సుమారు నాలుగు రోజులు అయి ఉండచ్చని, అలాగే మృతుడు తెలుపు రంగు చొక్కా ధరించి ఉన్నాడని, చొక్కా మీద జీవీ సెన్ అనే స్టిక్కర్ ఉందని ఎస్ఐ తెలిపారు. కాగా ఈ విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన సంఘటన స్థలానికి చేరుకుని, మృతదేహం తన కుమారుడు గజేంద్రుడిదిగా గుర్తించారు. మృతుడికి మద్యం అలవాటు ఉన్న కారణంగా మద్యం మత్తులో బావిలో పడి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఇల్లు కూల్చివేత

- దౌర్జన్యంగా ధ్వంసం చేయించిన కూటమి నేతలు


తమకు న్యాయం చేయాలని కోరుతున్న బాధితులు


రమణయ్య ఇంటిని కూల్చేస్తున్న దృశ్యం

చిట్టమూరు: మండలంలోని పెళ్లకూరు అరుంధతీయవాడలో వైఎస్సార్ సీపీ కార్యకర్త ఇంటిని సోమవారం కూటమి నేతల ప్రోద్బలంతో దౌర్జన్యంగా కూల్చివేశారు. బాధితుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన పారిచర్ల రమణయ్య, నాగజ్యోతి దంపతులు 15 ఏళ్లుగా ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో పూరి గుడిసె వేసుకుని నివాసం ఉంటున్నారు. గత ఎన్నికల్లో రమణయ్య వైఎస్సార్ సీపీ తరఫున గ్రామంలో పని చేశాడు. దీనిని జీర్ణించుకోలేక గ్రామంలోని కూటమి నేతలు రమణయ్యపై కక్ష గట్టారు. 20 సంవత్సరాల క్రితం గ్రామం నుంచి వెళ్లిన కస్తూరయ్య, ఏడు కొండలు అనే ఇద్దరు గూడూరు మండలం తిప్పగుంటపాళెంలో నివాసం ఉంటున్నారు. గ్రామంలోని కూటమి నేతలు గ్రామం నుంచి వెళ్లిన వారి వద్దకు వెళ్లి పెళ్లకూరులో మీ ఇంటి స్థలం ఉందని, దాన్ని మీకు ఇప్పిస్తామని, వారిని గ్రామానికి తీసుకువచ్చారు. వారం క్రితం కస్తూరయ్య, ఏడుకొండలు వచ్చి ఇది తమ స్థలమని ఖాళీ చేయాలని రమణయ్యను హెచ్చరించి వెళ్లారు. దీంతో రమణయ్య ప్రభుత్వం తమకు ఇచ్చిన ఇంటి నివేశ స్థలం సర్టిఫికెట్, ఇంటి పన్ను రసీదు, కరెంటు బిల్లు తమ పేరుతో ఉన్నాయని, వేరే వారు వచ్చి తమను ఖాళీ చేయాలని బెదిరిస్తున్నారని చిట్టమూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే సోమవారం కస్తూరయ్య, ఏడుకొండలు మరో నలుగురితో కలిసి పెళ్లకూరు గ్రామానికి చేరుకున్నారు. రమణయ్య నివాసం ఉంటున్న పూరింటిని ధ్వంసం చేశారు. ఇంట్లో ఉన్న వస్తులను కూడా రోడ్డు పడేశారు. అడ్డు పడిన రమణయ్య భార్య నాగజ్యోతిని కూడా పక్కకు నెట్టేసి ఇంటిని నామరూపాలు లేకుండా చేసి వెళ్లిపోయారు. ఆ సమయంలో కూలి పనులకు వెళ్లిన బాధితుడు రమణయ్య ఇంటికి చేరుకుని తనకు జరిగిన అన్యాయంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అలాగే తన దగ్గర ఉన్న ఇంటి స్థలానికి సంబంధించిన సర్టిఫికెట్లతో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశాడు. అయితే తను కూలి పనులు చేసుకుని దాచుకున్న నగదు, తన భార్య, కుమార్తెకు సంబంధించి బంగారు నగలు కూడా కనిపించడం లేదని పోలీసులకు తెలిపామన్నాడు. తమకు న్యాయం చేయాలని కోరుతున్నాడు. రమణయ్య, భార్య, పిల్లలు ఇంట్లో సామాను రోడ్డుపై పారేయడంతో ఏమి చేయాలో పాలుపోక కుటుంబ సభ్యులు రోడ్డుపైనే బాధపడుతూ గడుపుతున్నారు.

వరలక్ష్మీవ్రతానికి విస్తృత ఏర్పాట్లు


మాడవీధులలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న జేఈఓ

చంద్రగిరి: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో ఆగస్టు 8న వరలక్ష్మీ వ్రతం నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నట్లు టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం తెలిపారు. ఆయన సోమవారం తిరుచానూరులోని ఆస్థాన మండపంలో వరలక్ష్మీవ్రతం ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఆగస్టు 8వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వరలక్ష్మీ వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో రూ.వెయ్యి చెల్లించి ఇద్దరు భక్తులు పాల్గొనవచ్చన్నారు. సాయంత్రం 6 గంటలకు అమ్మవారు స్వర్ణ రథంపై నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతారని వెల్లడించారు. వ్రతం సందర్భంగా అభిషేకం, అభిషేకానంతర దర్శనం, లక్ష్మీపూజ, కల్యాణోత్సవం, బ్రేక్ దర్శనం, ఊంజల్ సేవలను టీటీడీ రద్దు చేస్తున్నట్టు తెలిపారు.

భక్తుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక సౌకర్యాలు

భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని మెరుగైన ఏర్పాట్లు చేయాలని జేఈఓ అధికారులను ఆదేశించారు. వరలక్ష్మీ వ్రతాన్ని భక్తులు తిలకించేందుకు వీలుగా ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయాలని, తాగునీరు, అన్నప్రసాదాలు విరివిగా పంపిణీ చేయాలని ఆదేశించారు. భక్తులకు పంపిణీ చేసేందుకు కుంకుమ ప్యాకెట్లు, కంకణాలు, గాజులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.

ఎస్వీబీసీలో ప్రత్యక్ష ప్రసారం

వరలక్ష్మీవ్రతాన్ని ఎస్వీబీసీలో ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అర్చకులు శ్రీనివాసాచార్యులు, బాబు స్వామి, మణికంఠ స్వామి, ఆలయ డిప్యూటీ ఈఓ హరీంద్రనాథ్, ఎస్ఈ (ఎలక్ట్రికల్) వెంకటేశ్వర్లు, అన్నదానం డిప్యూటీ ఈఓ సెల్వం, వీజీవో సురేంద్ర పాల్గొన్నారు.

భావి ఇంజినీర్లుగా ఎదగాలి


మాట్లాడుతున్న ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ

ఏర్పేడు : తిరుపతి ఐఐటీలో నూతనంగా బీటెక్ కోర్సుల్లో చేరిన విద్యార్థులు బాగా చదువుకుని భావి ఇంజనీర్లుగా ఎదగాలని ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ కేఎన్ సత్యనారాయణ ఆకాంక్షించారు. సోమవారం ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీలో యువంతర్– 2025 ఓరియంటేషన్ నిర్వహించారు. డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ ఈ ఏడాది మొత్తం 254 మంది విద్యార్థులు బీటెక్ ప్రవేశం పొందినట్లు వెల్లడించారు. విద్యా వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ రామకష్ణ గోర్తి , విద్యార్థి వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ ఎస్ ఎన్ మూర్తి ప్రసంగించారు.

విద్యావ్యవస్థ నిర్వీర్యం


కొత్తపేటలోని హాస్టల్‌లో విద్యార్థుల అవస్థలను తెలుసుకుంటున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నేతలు

- ఓబుల్ రెడ్డి

చంద్రగిరి: కూటమి పాలనలో విద్యావ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అయ్యిందని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఓబుల్ రెడ్డి ఆరోపించారు. పార్టీ అధిష్టానం పిలుపు మేరకు నాలుగు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో హాస్టళ్ల పరిశీలన చేపట్టారు. ఇందులో భాగంగా జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి పిలుపు మేరకు సోమవారం చంద్రగిరి మండల విద్యార్థి విభాగం అధ్యక్షుడు వినోద్ ఆధ్వర్యంలో చంద్రగిరిలోని ప్రభుత్వ హాస్టళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హాస్టళ్లలో సరైన సౌకర్యాలు లేవని, నాణ్యతలేని భోజనం, బోరు నీళ్లను అందిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం కిటికీలకు మెస్‌లు లేకపోవడంతో విద్యార్థులు దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.

విద్యావ్యవస్థపై దృష్టి సారించాలి

విద్యావ్యవస్థలో సమూలంగా మార్పులు తీసుకొచ్చామని, దేశంలో ఎక్కడా లేని విధంగా విద్యావ్యవస్థలో మెరుగైన సౌకర్యాలు కల్పించామని చెప్పుకునే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవాలను తెలుసుకోవాలని ఓబుల్ రెడ్డి సూచించారు. సీఎం చంద్రబాబు సొంత మండలంలో ప్రభుత్వ హాస్టళ్లు దుస్థితికి చేరుకున్నట్లు గుర్తించామన్నారు. విద్యార్థులు తాగేందుకు కనీసం మినరల్ వాటర్‌ను సైతం అందించలేదంటే ఈ ప్రభుత్వం విద్యార్థులపై ఎంత శ్రద్ధ వహిస్తోందో అర్థం చేసుకోవచ్చన్నారు. హాస్టళ్ల దుస్థితిపై విద్యార్థుల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్నట్లుగా తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ హాస్టళ్లను సందర్శించి, హాస్టళ్ల దుస్థితిపై నివేదిక సిద్ధం చేస్తామన్నారు. ఆపై దుస్థితికి చేరిన హాస్టళ్లలో నాణ్యమైన సౌకర్యాలు అందించాలని ఆగస్టు ఒకటో తేదీన జిల్లా కలెక్టర్‌కు నివేదికతో పాటు అర్జీ సమర్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెంగల్‌రెడ్డి, విద్యార్థి విభాగం మండల అధ్యక్షులు, హరి, యశ్వంత్ రెడ్డి, రఫి, జిల్లా కార్యదర్శి ప్రదీప్, కార్యవర్గ సభ్యులు పార్థసారథి, శేషారెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వండి

- గ్రీవెన్స్‌కు 260 అర్జీలు
- రెవెన్యూ సమస్యలపై 125 అర్జీలు


కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌కు 260 అర్జీలు వచ్చాయి. అందులో రెవెన్యూ సమస్యలపై 125 అర్జీలను వచ్చాయి. కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్షి, డీఆర్వో నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోస్మాండ్, దేవేంద్ర రెడ్డి, శివశంకర్‌నాయక్, సుధారాణి, పలువురు జిల్లా అధికారులు గ్రీవెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలని ఆదేశించారు. గ్రీవెన్స్‌కు ప్రతి విభాగానికి చెందిన జిల్లా అధికారి హాజరుకావాలని ఆదేశించారు. హాజరైన అధికారి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అందుబాటులో ఉండాలని చెప్పారు. మరోవైపు గ్రీవెన్స్‌కు వచ్చిన అర్జీదారులకు అవసరం అయిన మేరకు కుర్చీలను ఏర్పాటు చేయాలని, టీ, కాఫీ అందించాలని, తాగునీటి వసతులు కల్పించాలని వైద్యా ఆరోగ్యశాఖ వారు వైద్యశిబిరాన్ని నిర్వహించాలని ఆదేశించారు.

రెవెన్యూ అధికారులు అమ్ముడుపోయారు!

నా పేరు విజయమ్మ, మాది వాక్యం గ్రామం, బాలాయపల్లి మండలం. 8.80 ఎకరాల మా భూమిని అధికారపార్టీకి చెందిన నేతలు ఆక్రమించారు. ఈ విషయంపై మా మండల రెవెన్యూ అధికారులకు మొరపెట్టుకుంటే వారు పట్టించుకోవడం లేదు. మరోవైపు నేతలకు మా మండలంలోని పలువురు రెవెన్యూ అధికారులు అమ్ముడుపోయారు. గట్టిగా ప్రశ్నిస్తే మాపై దౌర్జన్యం చేస్తున్నారు. మాకు న్యాయం చేయండి సారూ అంటూ పలువురు మహిళలు సోమవారం గ్రీవెన్స్‌లో ఆవేదన చెందారు.

– విజయమ్మ, ఆమె కుటుంబ సభ్యులు

మాకు న్యాయం చేయండి!

నా పేరు మంకు మునెమ్మ, మాది శ్రీకాళహస్తి మండలం రాచగున్నేరి గ్రామం. మా గ్రామంలోనే సర్వే నంబర్ 283లో 1.93 ఎకరాల భూమి దశాబ్దాలుగా నా ఆధీనంలో ఉంది. 1994లో కరెంట్ సర్వీస్ తీసుకున్నాను. ప్రభుత్వం ఉచితంగా బోరు కూడా వేసింది. అయితే మా గ్రామానికి చెందిన అధికారపార్టీ నాయకుడు అదే ప్రాంతంలో 20 ఎకరాలు ప్రభుత్వ భూమిని ఆక్రమించి సాగు చేసుకుంటున్నారు. దాంతోపాటు 1.93 ఎకరాల నా భూమిని ఆక్రమించుకోవడానికి కుట్రలు చేస్తున్నారు. ఈ విషయాన్ని మా మండల రెవెన్యూ అధికారులకు తెలియజేసినప్పటికి వారు అధికారపార్టీకి చెందిన నేతకే మద్దతు తెలుపుతున్నారు. మా భూమి ఆక్రమణకు గురి కాకుండా కాపాడి, మా న్యాయం చేయండి.

– మంకు మునెమ్మ, రాచగున్నేరి, శ్రీకాళహస్తి మండలం

స్కిట్ కళాశాలలో అడ్మిషన్లు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధంగా ఉన్న స్కిట్ కళాశాలను మూడు సంవత్సరాల కిందట ఆలయ ఆర్థిక భారంతో మూత వేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు స్కిట్ కళాశాల జేఎన్‌టీయూ, స్కిట్ అనుసంధానంతో సెల్ఫ్ ఫైనాన్స్ పద్ధతిలో ఇంజినీరింగ్‌కు సంబంధించిన విద్యార్థుల ప్రవేశానికి ఆన్‌లైన్‌లో అనుమతించారు. ఇందులో మొదటి సంవత్సరం కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, సీఎస్ఈ(ఆర్టిఫిషియల్ ఇంటలిజెంట్ అండ్ మెషన్ లెర్నింగ్, సీఎస్‌టీ(డేటా సైన్స్), ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజినీరింగ్ సంబంధించి 66 సీట్లు చొప్పున మొత్తం 330 సీట్లు అలాట్ చేసినట్లు ప్రకటించారు. దీనిపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఒకో పోస్టుకు రూ.70 వేలుగా ఫీజు నిర్ణయించారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, మంత్రి నారా లోకేష్ సహకారంతో కళాశాల ప్రారంభం చేసినట్లు ప్రకటించారు. దీనిపై స్కిట్ కళాశాల వద్ద మంగళవారం సంబరాలు చేసుకోనున్నట్లు తెలిసింది. అయితే కోర్టు కేసులు, నాన్‌టీచింగ్, టీచింగ్‌కు సంబంధించి 90 మంది గతంలో పనిచేవారుండగా వారిలో కొంతమంది కోర్టు స్టే తెచ్చుకోనున్నారు. అలాగే నాన్ టీచింగ్ కింద 36 మంది, 24 మంది కాంట్రాక్టు పద్ధతిలో పనిచేశారు. వారి పరిస్థితి ఏమిటన్నది వెల్లడి కావాల్సి ఉంది. జేఎన్‌టీయూ ఏ ప్రాతిపదికన స్కిట్ కళాశాలతో అనుసంధానం అయిందో అనే విషయంపై త్వరలోనే వెల్లడి కావల్సి ఉంది.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

చంద్రగిరి:గుర్తు తెలియని వ్యక్తి ఉరివేసుకుని మృతి చెందిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని శ్రీనివాసమంగాపురం రైల్వేగేటు సమీపంలోని అటవీ ప్రాంతంలో సుమారు 40 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి చెట్టుకు ఉరివేసుకుని మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ అనిత తన సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని, 20 అడుగుల ఎత్తులో చెట్టుపైన వ్యక్తి మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడు ఉరివేసుకుని సుమారు 10 రోజులకుపైగా కావడంతో గుర్తు పట్టలేనంతగా ఉందని తెలిపారు. ఘటన స్థలంలో మద్యం బాటిళ్లను పోలీసులు గుర్తించారు. మృతుడి ఆచూకీ లభ్యం కాకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తిగా పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఆత్మహత్యకు పాల్పడ్డాడా, లేక హత్యచేసి చెట్టుకు వేలాదీశారా..? అన్న కోణంలో విచారిస్తున్నట్లు ఎస్ఐ అని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో భక్తుడి మృతి


సుబ్రమణ్యన్ మృతదేహం

నారాయణవనం: మండలంలోని జాతీయ రహదారిలో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తిరుమలకు కాలినడకన వెళుతున్న గోవిందమాల భక్తుడు బాలసుబ్రమణ్యన్(51)మృతి చెందాడు. తోటి భక్తుల కథనం మేరకు.. చెన్నై సమీపంలోని అంబత్తూరులో ప్రభుత్వ మద్యం దుకాణంలో బాలసుబ్రమణ్యన్ సేల్స్‌మన్‌గా పనిచేస్తున్నాడు. స్నేహితులతో కలిసి ఈనెల 26వ తేదీన శనివారం గోవిందమాల ధరించి కాలినడకన తిరుమలకు బయలుదేరాడు. సోమవారం సాయంత్రం మండలంలోని జాతీయ రహదారి బైపాస్‌లోని మండల కాంప్లెక్స్ సమీపానికి చేరుకున్నారు. అదే సమయంలో పుత్తూరు వైపు వస్తున్న వాహనం వేగంగా బాలసుబ్రమణ్యన్‌ను ఢీకొంది. తీవ్రంగా గాయపడిన బాలసుబ్రమణ్యన్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టానికి పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ లోకనాథం తెలిపారు.

పోలీసు గ్రీవెన్స్‌కు 100 అర్జీలు


జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజుకు ఫిర్యాదులు అందజేస్తున్న బాధితులు

తిరుపతి క్రైం: తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 100 ఫిర్యాదులు అందినట్టు ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. ఇందులో దొంగతనాలు, ఆస్తి తగాదాలు, ఆర్థికపరమైన లావాదేవీలు ఉన్నాయన్నారు. అర్జీలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

రైల్లో నుంచి పడి వ్యక్తి మృతి

దొరవారిసత్రం : స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ నుంచి జారి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే గ్యాంగ్ సిబ్బంది గుర్తించి సూళ్లూరుపేట జీఆర్‌పీ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత శిక్షణ

తిరుపతి అర్బన్: ఎస్సీ, ఎస్టీ మహిళలకు జర్మనీ భాష నేర్చుకోవడం కోసం ఆఫ్‌లైన్‌లో ఉచిత శిక్షణ ఇస్తామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆర్.లోకనాథం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే అన్ని కులాలకు చెందిన వారికి ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ ఇస్తామని వెల్లడించారు. బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి, రెండేళ్లపాటు క్లినికల్ అనుభవం ఉండాలని చెప్పారు. జీఎన్ఎం నర్సింగ్ పూర్తి చేసి 3 ఏళ్ల క్లినికల్ అనుభవం ఉండాలని తెలిపారు. 35 ఏళ్లు మించకూడదని స్పష్టం చేశారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జర్మనీభాషపై శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. 8 నుంచి 10 నెలలు శిక్షణ తర్వాత బీ2 స్థాయి పరీక్ష ఉత్తీర్ణత సాధించాలని వెల్లడించారు. ఆసక్తి ఉన్న వారు ఏపీ స్టేట్ నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని, అంతేకాకుండా ఆధార్‌కార్డు, కులధ్రువీకరణ పత్రం, నర్సింగ్ డిగ్రీ సర్టిఫికెట్ కాపీ, క్లినికల్ అనుభవం పత్రం ఉండాలని స్పష్టం చేశారు. తిరుపతిలోని బైరాగిపట్టెడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల కళాశాల వసతి గృహంలో శిక్షణ ఉంటుందని చెప్పారు. డీఎస్‌సీడబ్ల్యూ ఈఓటీపీటీ జీమెయిల్.కామ్ ద్వారా దరఖాస్తులను పంపాలని చెప్పారు. అదనపు సమాచారం కోసం 9160912690 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

అమానుష ఘటనపై ఆగ్రహం


పాఠశాల వద్ద ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

కోట : స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థినులతో గుంజిళ్లు తీయించిన అమానుష ఘటనపై ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన పాఠశాలకు సందర్శనకు విచ్చేశారు. విద్యార్థినులతో మాట్లాడేందుకు యత్నించగా పోలీసులు పాఠశాలలోకి అనుమతించలేదు. దీంతో ఉపాధ్యాయులను బడి బయటకు పిలిపించి ఘటనపై ఆరా తీశారు. హెచ్ఎం భారతి మాట్లాడుతూ ఎస్సీ హాస్టల్ విద్యార్థినులతో గుంజిళ్లు తీయించిన పీడీ సుభాన్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేసినట్లు తెలిపారు. బాలికలు గుంజిళ్లు తీస్తుంటే ఉపాధ్యాయులు ఎందుకు అడ్డుకోలేదని ఎమ్మెల్సీ ప్రశ్నించారు. పీడీ వ్యవహారంపై కమిటీ వేసి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. నేరం రుజువైతే నిందితుడిని సర్వీస్ నుంచి డిస్మిస్ చేయాలని కోరారు. పిల్లలతో మాట్లాడి వారిలో ఆత్మస్థైర్యం నింపేందుకు వస్తే పోలీసులు అడ్డుకోవడం సరికాదని మండిపడ్డారు. ఎస్ఐ పవన్‌కుమార్ మాట్లాడుతూ పీడీపై ఇప్పటికే కేసు నమోదు చేసినటు వెల్లడించారు.

అనంతరం ఎస్సీ బాలికల హాస్టల్‌ను ఎమ్మెల్సీ మేరిగ సందర్శించారు.వార్డెన్ ఉషారాణితో మాట్లాడారు. పిల్లలకు తగిన భద్రత కల్పించాలన్నారు. వైఎస్సార్‌సీపీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అశ్విత్‌రెడ్డి, మండల కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, షనీల్‌రెడ్డి, ప్రసాద్‌గౌడ్, సుధారెడ్డి, పి.సురేంద్ర, శశిరెడ్డి, సాయిరెడ్డి, కోటారెడ్డి, నాగూర్‌యాదవ్ పాల్గొన్నారు.

అట్టహాసంగా గోదాంకితావధానం

- పృచ్ఛకుల ప్రశ్నలకు సమాధానం ఇచ్చిన అవధాని మేడసాని మోహన్


మహిళా వర్సిటీలో గోదాంకితావధానం నిర్వహిస్తున్న డాక్టర్ మేడసాని మోహన్

తిరుపతి రూరల్: పద్మావతి మహిళా వర్సిటీలోని సావేరి సెమినార్ హాలులో సోమవారం గోదాదేవి అవతారోత్సవం సందర్భంగా తెలుగు అధ్యాయన శాఖ, తిరుపతి శ్రీకృష్ణదేవరాయ సత్సంగ్ సంయుక్తంగా గోదాంకితావధానాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఇందులో అవధానిగా టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి డాక్టర్ మేడసాని మోహన్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కలియుగంలో శ్రీమన్నారాయణుని ప్రాశస్త్యాన్ని, ఔన్నత్యాన్ని భక్త లోకానికి తెలిపేందుకు గోదాదేవి అవతరించిందని తెలిపారు. అనంతరం పృచ్ఛకులు అడిగిన ప్రశ్నలను సమన్వయం చేసుకుంటూ అవధానాన్ని దిగ్విజయంగా పూర్తి చేశారు. వీసీ ఆచార్య ఉమ మాట్లాడుతూ భగవంతుడిని కీర్తిస్తూ గోదాదేవి గానం చేసిన పాశురాలు తిరుప్పావై పాశురాలుగా ప్రసిద్ధి పొందాయని తెలిపారు. తమిళనాడులోని శ్రీవిల్లిపుత్తూరులో గోదాదేవి ఆలయం ఉందని, ఆమె ధరించిన మాలను శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో గరుడోత్సవం రోజున మలయప్ప స్వామికి ధరింప చేస్తారని పేర్కొన్నారు. తెలుగు అధ్యయన శాఖ అధ్యక్షులు ఆచార్య కొలకలూరి మధుజ్యోతి మాట్లాడుతూ గోదాదేవి భక్తిని కొనియాడుతూ కావ్యంగా మలిచిన శ్రీకృష్ణదేవరాయలు ప్రశంసనీయులన్నారు. ఆచార్య నిర్మలా తమ్మారెడ్డి మాట్లాడుతూ మేడసాని మోహన్‌తో తనకున్న గురు శిష్యుల బంధాన్ని తెలియజేశారు. స్వర్ణభారత్ ట్రస్ట్ అధినేత్రి ఇమ్మని దీపావెంకట్ మాట్లాడుతూ తన తండ్రి, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడికి తెలుగు భాషపై ఎనలేని మక్కువ ఉందన్నారు. పృచ్ఛక వి దుషీమణులుగా నిషిద్ధాక్షరి – ఆచార్య సి.లలితారాణి, న్యస్తాక్షరి – డాక్టర్ యువశ్రీ, దత్తపతి – డాక్టర్ వై సుభాషిణి, సమస్య – డాక్టర్ సి.లత, వర్ణన – డాక్టర్ సి.స్వరాజ్యలక్ష్మి, అప్రస్తుత ప్రసంగం – డాక్టర్ జయమ్మ, పురాణ పఠనం – డాక్టర్ జి సుహాసిని, ఆశువు– డాక్టర్ బి.కృష్ణవేణి వ్యవహరించారు.